www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 22 మే 2024




ఇకపై ఇంటర్ ఆన్‌లైన్ వాల్యుయేషన్

22, 26 తేదీల్లో ప్రత్యేక శిక్షణా తరగతులు

ఆకివీడు: ఇంటర్మీడియట్ విద్యార్థులు రాసిన పరీక్ష పేపర్లు దిద్దేందుకు అధ్యాపకులు ఇకపై స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈమేరకు ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి ఆర్ఐఒ చంద్రశేఖర రావు స్థానిక జూనియర్ కళాశాలలకు సమాచారం పంపారు. ఈ ప్రక్రియలో భాగంగా ముందుగా ఇటీవల ముగిసిన అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల పేపర్లో వాల్యుయేషన్ ఆన్‌లైన్‌లో దిద్దేందుకు అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఈ శిక్షణ ఈనెల 22, 26వ తేదీలలో రెండు రోజులు జిల్లా కేంద్రం భీమవరంలో జరగనుంది. 22వ తేదీన సిఎస్ఎన్ కళాశాలలో గణితం, బోటనీ, జువాలజీ, అదేరోజు భీమవరం నారాయణ కళాశాలలో ఇంగ్లీష్, సంస్కృతం, కామర్స్ సబ్జెక్టులకు ఆన్‌లైన్ సంకలనంకు శిక్షణ ఇస్తారు. 26వ తేదీ సిఎస్ఎన్ కళాశాలలో ఫిజిక్స్, రసాయన శాస్త్రం, నారాయణ కళాశాలలో హిందీ, తెలుగు, సివిక్స్, చరిత్ర, అర్థశాస్త్రంలలో ఇస్తున్నట్లు తెలిపారు.

కౌలు కార్డులు ఇచ్చేదెప్పుడు..!



- నేటికీ ప్రారంభం కాని ప్రక్రియ
- ప్రతియేటా ఏప్రిల్ నుంచే గ్రామసభలతో ముందుకు
- రెండు జిల్లాల్లో దాదాపు 3 లక్షల మంది కౌలురైతులు
- గతేడాది లక్షా 40 వేల మందికే కార్డులు జారీ
- పంట రుణాల మంజూరు అంతంత మాత్రమే
- ఈ ఏడాదైనా కౌలురైతులకు న్యాయం జరిగేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ కొద్దిరోజుల్లో ప్రారంభం కానుంది. రైతులు విత్తనాల కొనుగోలు వంటి ప్రక్రియను చేపట్టారు. కౌలు ఒప్పందాలు సైతం దాదాపు పూర్తయ్యాయి. కౌలురైతుల గురించి మాత్రం ప్రభుత్వం మరిచిపోయినట్లు కన్పిస్తోంది. ఇప్పటికీ కౌలుకార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించకపోవడం అందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. ఖరీఫ్‌లో నాలుగు లక్షల ఎకరాలకుపైగా వరిసాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా కౌలురైతులే సాగు చేస్తున్నారు. వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతుల పట్ల ప్రతియేటా ప్రభుత్వం చిన్నచూపే చూస్తోంది. వైసిపి ప్రభుత్వం వచ్చాక కౌలురైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. కౌలుదారులకు సంబంధించిన '2011 భూ అధీకృత సాగుదారుని చట్టం'ను వైసిపి సర్కార్ మార్చేసింది. 2011 చట్టంలో భూయజమానితో సంబంధం లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి భూములు కౌలుకు చేస్తున్న రైతులను గుర్తించి కౌలుకార్డులు జారీ చేయాలనే నిబంధన ఉంది. వైసిపి ప్రభుత్వం తెచ్చిన 2019 పంట సాగుదారుని హక్కు చట్టంలో భూయజమాని అంగీకారంతోనే కౌలుకార్డులు జారీ చేయాలని కొత్త నిబంధన తెచ్చింది. కౌలుదారులకు రుణార్హత కార్డులు ఇచ్చేందుకు భూయజమానులు అంగీకరించడం లేదు. దీంతో గడిచిన ఐదేళ్లుగా కౌలురైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలురైతులు ఉండగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలో 57 వేల కౌలుకార్డులు, పశ్చిమగోదావరిలో 85 వేల మందికి మాత్రమే కౌలుకార్డులు జారీ చేసిన పరిస్థితి ఉంది. దీంతో దాదాపు మరో లక్షా 50 వేల మందికిపైగా కౌలురైతులకు కౌలుకార్డులు అందనే లేదు. దీంతో కౌలురైతులకు బ్యాంకుల నుంచి పంటరుణాలుగాని, దెబ్బతిన్న పంటలకు సంబంధించి పరిహారం, బీమా వంటివి సైతం అందని పరిస్థితి ఏర్పడింది. కార్డులు ఇచ్చిన రైతులకు కూడా అరకొర రుణాలు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారు. కౌలుకార్డులు లేకపోవడంతో పండించిన పంటను సైతం భూయజమాని పేరుపైనే అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో గడిచిన ఐదేళ్లుగా కౌలురైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

నేటికీ ప్రారంభం కాని ప్రక్రియ..

కౌలుకార్డుల జారీకి సంబంధించిన ప్రక్రియ ఏప్రిల్ మూడోవారం నుంచే అధికారులు ప్రారంభించేవారు. గ్రామసభలు ఏర్పాటు చేసి కౌలురైతులను గుర్తించేవారు. భూయజమానులకు అవగాహన కల్పించే ప్రక్రియ చేపట్టేవారు. ఈ ఏడాది ఎన్నికలు రావడంతో ఇప్పటి వరకూ కౌలుకార్డులకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభం కాలేదు. జూన్ రెండోవారం నుంచి ఖరీఫ్ నారుమడులు ప్రారంభమయ్యే పరిస్థితి ఉంది. సాగుచేసే రైతులకు కౌలుకార్డులు జారీచేసి బ్యాంకులు రుణాలు అందిస్తేనే కౌలురైతులకు మేలు జరుగుతుంది. లేకపోతే ప్రయివేటు వడ్డీవ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. గతంలో జారీ చేసిన కౌలుకార్డులను రెన్యువల్ చేయడంతోపాటు, కొత్త కార్డుల జారీ ప్రక్రియ చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉంది. అంతేకాకుండా భూయజమానితో సంబంధం లేకుండా వాస్తవ సాగుదారులకు కౌలుకార్డులు జారీ చేయాలి. ఎన్నికల నేపథ్యంలో కౌలురైతులను పూర్తిగా గాలికి వదిలేస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. అదే జరిగితే ఈ ఏడాది కౌలురైతులకు అన్యాయం చేసినట్టే అవుతోంది.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

కౌంటింగ్‌లో రిటర్నింగ్ అధికారులదే కీలకపాత్ర

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జూన్ 4న నిర్వహించే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో రిటర్నింగ్ అధికారులే కీలకపాత్ర పోషించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు అనుమతించరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్‌పి అజిత వేజెండ్ల సంయుక్తంగా కౌంటింగ్ ఏర్పాట్లు, లెక్కింపు, బందోబస్తు తదితర ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ మాట్లాడుతూ కౌంటింగ్ ఏర్పాట్లలో చట్టపరమైన నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. కౌంటింగ్ హల్‌లోకి మొబైల్ ఫోన్లు అనుమతి లేదని, ఈ మేరకు సంబంధిత సిబ్బంది కచ్చితమైన తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. విష్ణు కాలేజ్ ఆవరణలోకి ఎటువంటి వాహనాలూ అనుమతించడం లేదని, విష్ణు కాలేజీ వెలుపల మాత్రమే పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఉదయం ఐదు గంటల నుంచి ఓట్ల లెక్కింపునకు సంబంధించి కార్యాచరణ సిద్ధం చేసుకుని అమలు చేయాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది తప్ప మిగిలిన ఎవ్వరినీ కౌంటింగ్ ప్రాంతంలోకి అనుమతించరాదన్నారు. రిటర్నింగ్ అధికారి మొబైల్ ఫోన్ మాత్రమే కౌంటింగ్ హాల్‌లోకి తీసుకెళ్లే అవకాశం ఉందని, వాటి ద్వారా రౌండ్‌ల వారీగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఓట్ల లెక్కింపునకు సరిపడా సిబ్బంది నియామకం చేపట్టాలన్నారు. మీడియా సెంటర్‌కు ప్రత్యేక హాల్, మౌలిక వసతులు, టెలిఫోన్, ఇంటర్నెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పరిశీలన కోసం మీడియా ప్రతినిధులను నిర్దేశించిన ప్రదేశం వరకే అనుమతిస్తారని, మీడియా సెంటర్ వరకూ మొబైల్ ఫోన్లను అనుమతించవచ్చునని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి మీడియా ఏ ప్రాంతం వరకు అనుమతించబడుతుందో గుర్తించడానికి సైన్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రౌండ్‌ల వారీ సమాచారం అందించడంతోపాటు ఇతర ముఖ్యమైన అనౌన్స్‌మెంట్లకు కౌంటింగ్ హాల్లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు నియామక ఉత్తర్వులు, టేబుల్ కేటాయింపుల కోసం చర్యలు తీసుకోవాలన్నారు. రౌండ్‌వారీగా వివరాలు సంబంధిత రిటర్నింగ్ అధికారి డిజిగ్నేటెడ్ అధికారిని నియమించుకుని, వారి ద్వారా మీడియా విభాగానికి సమాచారం అందజేయాలన్నారు. భద్రతా ఏర్పాట్లు నేపథ్యంలో ఇవిఎంల తరలింపునకు బారికేడ్లు ఏర్పాటు, ప్రవేశ ద్వారం, మళ్లింపు కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కోరారు.

జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా పూర్తి చేసుకోవడానికి కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో కౌంటింగ్‌ను కూడా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. బాటిల్స్, టిన్స్ ద్వారా పెట్రోలు అమ్మకాలను నిషేధించినట్లు తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో సంబంధిత తహశీల్దార్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. బాణాసంచా తయారీ, రవాణా, వినియోగంపై జిల్లా వ్యాప్తంగా నిషేధాజ్ఞలు ఉన్నాయని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య, డిఆర్ఒ జె.ఉదయ భాస్కరరావు, జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు, రిటర్నింగు అధికారులు వి.స్వామి నాయుడు, బి.శివనారాయణరెడ్డి, ఎం.అచ్యుత అంబరీష్, కె.శ్రీనివాసులురాజు, బి.వెంకట రమణ, కె.చెన్నయ్య, ట్రైయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, డిఎస్‌పిలు జి.శ్రీనివాసరావు, డిఎస్ఆర్ఎస్ఎన్.మూర్తి, వి.నారాయణస్వామిరెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

14 రౌండ్లలో ఆచంట ఫలితాలు

మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు

రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నియోజకవర్గం నుంచి అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించి 14 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుందని, అనంతరం ఫలితాలు ప్రకటిస్తామని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కౌంటింగ్ విధివిధానాలకు సంబంధించి ఆయన వివరించారు. ఈ సందర్భంగా స్వామినాయుడు మాట్లాడుతూ భీమవరం సీతా పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్లు లెక్కింపు జూన్ 4న జరుగుతుందని, అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించి 14 టేబుల్స్ ఉంటాయని తెలిపారు. అవి కాకుండా మరో నాలుగు టేబుల్స్ పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించినవి అసెంబ్లీ కౌంటింగ్ హాలులో ఉంటాయన్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రారంభమవుతుందని, అరగంట తరువాత 14 టేబుల్స్‌కు పోలింగ్ స్టేషన్ల వారీగా ఇవిఎంల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఏజెంట్లు ఉదయం ఏడు గంటల్లోపే చేరుకోవాలని, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని, సీసీ టీవీ కెమెరాల నిఘాలో కౌంటింగ్ ప్రక్రియ సాగుతుందని తెలిపారు. మొబైల్ ఫోన్ల డిపాజిట్ కౌంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఆయా పార్టీల ఏజెంట్లతోపాటు తహశీల్దార్లు ఆర్‌వివి.రోహిణిదేవి, కె.లక్ష్మీకళ్యాణి, ఎంపిడిఒలు పి.నరసింహప్రసాద్, ఎస్.శ్రీనివాస్‌దొర, పి.పద్మజ, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎం.రాంప్రసాద్‌రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి స్వామినాయుడు

కొనసాగిన ఫుడ్‌ఫ్యాట్స్ కార్మికుల దీక్షలు

యాజమాన్యం వేతన ఒప్పందం వెంటనే చేయాలి - సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఫుడ్‌ఫ్యాట్స్ యాజమాన్యం కార్మికులకు వెంటనే వేతన ఒప్పందం చేయాలని కోరుతూ 3ఎఫ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు), సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ ప్రధాన గేటు వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం రెండోరోజు కొనసాగాయి. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ 3ఎఫ్ యాజమాన్యం మొండివైఖరి వీడాలని, వెంటనే వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం మార్చి నెలతోనే వేతన ఒప్పందం కాల పరిమితి పూర్తయినప్పటికీ 3ఎఫ్ యాజమాన్యం నూతన వేతన ఒప్పందానికి సిద్ధపడకపోవడం దుర్మార్గమన్నారు. గత వేతన ఒప్పందంలో 29.5 శాతం పెంపు ఉండగా, ప్రస్తుతం గతం కంటే ఎక్కువ వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై 3ఎఫ్ యాజమాన్యంతోనూ, ఏలూరు లేబర్ అధికారులతోనూ దఫదఫాలుగా చర్చలు జరిగాయని వివరించారు. 3ఎఫ్ యాజమాన్యం మొండివైఖరిపై లేబర్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వేతన ఒప్పందం చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఆందోళన, నిరసన, సమ్మె కార్యక్రమాలు నిర్వహించి యాజమాన్యానికి తగు బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, 3ఎఫ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.గణేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.



దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న రాజా రామ్మోహన్‌రాయ్

మాజీ ఎంఎల్‌ఎ పెండ్యాల కృష్ణబాబు మృతి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విషాదఛాయలు

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

ప్రముఖ రాజకీయవేత్త, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు మాజీ ఎంఎల్‌ఎ పెండ్యాల కృష్ణబాబు (71) మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. 1983 నుంచి 94 వరకూ వరుసగా నాలుగుసార్లు కొవ్వూరు నుంచి టిడిపి ఎంఎల్‌ఎగా కృష్ణబాబు ఘన విజయం సాధించారు. 1999లో ఓటమి చెంది, 2004లో ఐదోసారి కొవ్వూరు ఎంఎల్‌ఎగా గెలిచి కృష్ణబాబు రికార్డు సృష్టించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితుడు కావడంతో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పెట్టిన వైసిపిలో కొన్నేళ్ల క్రితం చేరారు. 2009లో కొవ్వూరు నియోజకవర్గం ఎస్‌సి రిజర్వు కావడంతో ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న కృష్ణబాబు 2019 ఎన్నికల్లో ప్రస్తుత మంత్రి తానేటి వనితకు కొవ్వూరు వైసిపి టికెట్ ఇప్పించడంతోపాటు ఆమె విజయానికి కృషి చేశారు. అంతేకాక రాష్ట్ర మంత్రివర్గంలో ఆమె నియామకానికి కృషి చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘకాలం కృష్ణబాబు చక్రం తిప్పారు. టిడిపిలో ఉండగా కొవ్వూరు నియోజకవర్గంతోపాటు పోలవరం, గోపాలపురం నియోజకవర్గాల్లో అభ్యర్థుల విజయానికి ఆయన వెన్నుదన్నుగా నిలిచారు. కృష్ణబాబు మరణ వార్త తెలిసిన వెంటనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా రాజకీయ నేతలు, ప్రజలు ధిగ్భ్రాంతికి గురయ్యారు. ఆంధ్రా సుగర్స్‌తో పలు ఫ్యాక్టరీల నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి కృష్ణబాబు భౌతికకాయాన్ని ఆయన స్వగ్రామమైన కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి తీసుకొచ్చారు. బుధవారం ఆయన పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తారు. కృష్ణబాబు మతికి సంతాప సూచకంగా బుధవారం కొవ్వూరులో వ్యాపార సంస్థలను మూసివేస్తున్నట్లు సంబంధీకులు తెలిపారు.



కృష్ణబాబు (ఫైల్‌ఫొటో)

సంతాపం తెలిపిన మాజీ ఎంఎల్‌ఎఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు: కొవ్వూరు మాజీ ఎంఎల్ఎ పెండ్యాల వెంకటకృష్ణారావు(కృష్ణబాబు) అకాల మరణానికి తణుకు మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొమ్మేరు జమీందారు కుటుంబానికి చెందిన ఆయన మెట్ట ప్రాంత ప్రజలకు సుపరిచితుడు అయ్యారన్నారు. టిడిపి ఆవిర్భావం నుంచి 1983, 1985, 1989, 1994, 2004 వరకూ 5 సార్లు ఎంఎల్ఎగా విజయం సాధించిన ఘనత ఉందన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముళ్లపూడి వెంకటకృష్ణారావు, దొమ్మేటి వెంకటసుధాకర్, పరిమి వెంకన్నబాబు, కలగర వెంకటకృష్ణ, మంత్రిరావు వెంకటరత్నం, బసవ రామకృష్ణ, తాతపూడి మారుతీరావు, ఒమ్మి రాంబాబు పాల్గొన్నారు.

మహిళా హోంగార్డుపై కానిస్టేబుల్ లైంగిక వేధింపులు!

ఒప్పకోకుంటే ఏమైనా చేస్తా అని బెదిరింపులు

ఎవరూ నన్నేమీ చేయలేరని ఛీంకారం

ఎస్‌పికి ఫిర్యాదు చేసిన మహిళా హోంగార్డు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అతనొక బాధ్యతగల పోలీస్.. అయితేనేమీ కామంతో కళ్లు మూసుకుపోయి తోటి మహిళా ఉద్యోగస్తులను సోదరి భావంతో ఆదరించవలసింది పోయి కామంతో కీచకుడిలా వ్యవహరిస్తున్నాడు. మహిళా హోంగార్డును తనతో ఉండటానికి ఒప్పుకోవాలని లేకుంటే ఏమైనా చేస్తానని బెదిరిస్తున్నాడు. తనని ఎవరూ ఏమీ చేయలేరని ధీమా వ్యక్తం చేస్తున్నారు. డిపార్ట్‌మెంట్‌లో ఎస్‌పి కూడా నన్నేం చేయలేరు, తెలుసా ఇప్పటికైనా ఒప్పుకుంటావా అంటూ తరచూ ఆ మహిళా హోంగార్డు ఇంటికి వచ్చి నానా రాద్ధాంతం చేస్తున్నాడు. ఆ వేధింపులు భరించలేని ఆమె జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేయడంతో సమస్య వెలుగులోకి వచ్చింది.

భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామంలో నివాసం ఉంటున్న మహిళా హోంగార్డు నరసాపురం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన జగ్గు రోతి రాజేష్ మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అయితే హోంగార్డ్ భర్త హోంగార్డ్‌గా పనిచేస్తూ చనిపోవడంతో అదే ఉద్యోగాన్ని అతని భార్యకు హోంగార్డుగా ఇచ్చారు. ఆమె నరసాపురం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా చేస్తున్నారు. ఆమెకు ఆరో తరగతి చదువుతున్న కుమారుడు కలడు. ఎన్నికల నేపథ్యంలో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచిన ఇవిఎంల స్ట్రాంగ్ రూముల వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఇదే గ్రామంలో 4 వీధుల అవతల కానిస్టేబుల్ రాజేష్ నివాసం ఉంటున్నాడు. అయితే వృత్తిరీత్యా రాజేష్, మహిళ హోంగార్డు ఇంటి వైపు నుంచి రాకపోకలు సాగిస్తున్నాడు. దీంతో మహిళా హోంగార్డుపై కన్నేసిన రాజేష్ తరచూ హోంగార్డుతో నాతో వచ్చే నీకు భర్త లేడు కదా అన్నీ నేను చూసుకుంటాను అంటూ వేధిస్తున్నాడు. ఆమె తిరస్కరించడంతో కక్ష పెంచుకున్న రాజేష్ ఆమెపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నాడు. అయినా ఆమె పట్టించుకోకపోవడంతో నేరుగా ఇంటికి వచ్చి రెండు సార్లు గొడవ చేసినట్లు ఆమె జిల్లా ఎస్‌పికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీన రాత్రి 7 గంటల సమయంలో తనపై దాడి చేసినట్లు ఆమె ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో రాజేష్ తాను గతంలో ఇక్కడ పనిచేసిన భీమవరం వన్ టౌన్ సిఐని చొక్కా పట్టుకుని చెంపలు పగలగొట్టానని, అయినా నన్నెవరూ ఏమీ చేయలేరంటూ హోంగార్డును భయపెట్టే ప్రయత్నం చేశాడని, దీంతో తన ఆత్మరక్షణ కోసం జిల్లా ఎస్‌పి అజిత వెజెండ్లకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

కొనసాగిన ఎపిఇఎపి సెట్ పరీక్షలు

తాడేపల్లిగూడెం: ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికిగాను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎపిఇఎపిసెట్ ఆరో రోజు మంగళవారం ఇంజినీరింగ్ విభాగంలో స్థానిక వాసవి ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 249 మందికి గాను 243 మంది, సాయంత్రం నిర్వహించిన పరీక్షకు 249 మందికి 244 మంది మొత్తంగా 498 మందికి 487 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకర్‌రావు తెలిపారు. పరీక్షా కేంద్రం కోఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్ పర్యవేక్షించారు.



పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

26న ఉచిత మెగా మెడికల్ క్యాంప్

భీమవరం రూరల్: ఈనెల 26(ఆదివారం) ఉదయం 8 గంటల నుంచి బిపి, షుగరు, ఫిట్సు, ఫెరాలసిస్, ఇతర వ్యాధులకు ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మెడికల్ టీం కన్వీనర్, వసుధ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. మంగళవారం సుందరయ్య భవనంలో అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు, మెడికల్ టీం సమావేశం జరిగింది. అనంతరం స్థానిక సిపిఎం కార్యాలయంలో కరపత్రం విడుదల చేశారు. ఈ క్యాంపునందు ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ గోపాళం శివన్నారయణ(విజయవాడ), డాక్టర్ సందీప్‌వర్మ(మన హాస్పటల్) డాక్టర్ జి.పద్మజ, డాక్టర్ పి.సత్యనారాయణ రాజు పాల్గొని రోగులను చూస్తారని తెలియజేశారు. 3 నెలలకు సరిపడా మందులు రూ.300లకే బిపి, షుగరు, పెరాలసిస్ పేషెంట్లకు ఇస్తారని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే ఈ మెడికల్ క్యాంప్‌ని వినియోగించుకోవాలన్నారు. ప్రతిరోజు సుందరయ్య భవనంలో ఉచిత ఆసుపత్రి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిపి, షుగరు, అవసరమైనవారికి ఇసిజి సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో మెడికల్ క్యాంప్ టీం చైతన్య ప్రసాద్ పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించడమే లక్ష్యం

వేసవి వినోద శిబిరంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

బాల బాలికలను సెల్ ఫోన్‌ల నుంచి మళ్లించి, వారిలో సృజన వెలికితీయడం, వారిని ఆట, పాటల వైపు మళ్లించడమే వేసవి వినోద శిబిరం లక్ష్యమని జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ అధ్యక్షులు సిహెచ్.ప్రసాదరాజు, ప్రధాన కార్యదర్శి కె.రామ లక్ష్మణ్ అన్నారు. మండలంలోని పొలమూరులో కలిదిండి సూర్యనారాయణ రాజు జనవిజ్ఞాన కళా వేదిక ప్రాంగణంలో 10 రోజుల వేసవి వినోదం శిబిరాన్ని వారు ప్రారంభించారు. ప్రజల్లో మూఢ విశ్వాశాలను నిర్మూలించడం, శాస్త్రీయ ధృక్పథం అలవర్చడం, నూతన విషయాలు అన్వేషించడమే ఆశయంగా గత 36 సంవత్సరాలుగా ఈ వేదిక పనిచేస్తుందని వారు పేర్కొన్నారు. ఈ శిబిరంలో 9 నుంచి 14 సంవత్సరాల వయస్సు ఉన్న పలువురు బాల బాలికలు పాల్గొన్నారు. వారికి గణితంలో మెళకువలు, సైన్స్ ప్రయోగాల గురించి వివరించారు. ఆటలు, పాటలు, నీతి కథలు, చిత్ర లేఖనం, ఓరుగామి అనే పేపర్ కటింగ్ వంటి అంశాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అజయ్ కుమార్, సహాయ కార్యదర్శి చింతపల్లి ఉదయ్ కిరణ్, ఐద్వా జిల్లా శాఖ అధ్యక్షురాలు కేతా పద్మజ పాల్గొన్నారు.



వేసవి శిబిరంలో పాల్గొన్న పిల్లలతో జెవివి నాయకులు

టిడ్కో గృహాల వద్ద పోలీసుల కార్డెన్ సెర్చ్

9 మోటార్ సైకిళ్లు స్వాధీనం

పాలకొల్లు: పాలకొల్లు టిడ్కో గృహాల వద్ద పట్టణ పోలీసులు మంగళవారం కార్టన్ సెర్చ్ నిర్వహించారు. గృహాల్లో రికార్డులు పరిశీలించారు. రికార్డులు సరిగా లేని, నెంబర్ ప్లేట్లులేని 9 మోటార్ సైకిళ్లు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే తరువాత వాటి రికార్డులు తీసికొనివచ్చి వాటిని వాహనదారులు తీసికొని వెళ్లారు. ఈ సెర్చ్‌లో సిఐ మంగాదేవి, ఎస్ఐ బాదం శ్రీనివాస్, ఎఎస్ఐలు ముద్దల శివాజీ, శీలబోయిన ఏసుబాబు, మారిలింగం పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి మహాప్రభో

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నెగ్గిపూడి పంచాయతీ శివారు వనంపల్లిలో పారిశుధ్యం, మురుగు పారుదల సమస్యలను అధికారులు పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వనంపల్లి గ్రామంలోకి వెళ్లే మార్గంలో మురుగు నీటి కాలువ పక్కన వేస్తున్న చెత్త వల్ల దుర్వాసనతో పాటు దోమలు పెరగడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించి, బ్లీచింగ్ చల్లడం వంటి చర్యలు చేయిస్తున్నామని పంచాయతీ సానిటరీ సిబ్బంది తెలిపారు.



ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న సోమరాజు

ప్రత్తిపాడును విలీనం చేయొద్దు

ఉపాధి కూలీలు డిమాండ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ప్రత్తిపాడు గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని స్థానిక ఉపాధి కూలీలు డిమాడ్ చేశారు. ఉపాధి పర్యటనలో భాగంగా మంగళవారం ప్రత్తిపాడు గ్రామాన్ని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ మున్సిపాలిటీలో విలీనం చేస్తే తమకి ఉపాధి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పూర్తిస్థాయిలో పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోమల శ్రీనివాసు, విర్ల శివ నాగు, కలిసెట్టి దానయ్య, పెనుమాక మేరీ కుమారి, ముప్పిడి నాగమణి, బాదం గణపతి, కొల్లూరి కృష్ణ, గడ్డం జయమ్మ, నాగరాజు, వేర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా పాలకవర్గ సమావేశం

ప్రజాశక్తి ఆకివీడు

అజెండా ఏమీ లేకుండానే స్థానిక నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో జరిగిన ఈ సమావేశం పాలకవర్గ ఛైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో నామమాత్రపు అజెండ మాత్రం పెట్టారు. సమావేశం కోసం తయారైన ఈ అజెండాలో ఈనెల 16వ తేదీ వరకు గల నగర పంచాయతీ ఆర్థిక నిల్వల ముగింపు నిల్వ మొత్తం ఒక కోటి 90 లక్షల 44 వేల రూపాయలు ఉన్నట్లు పాలకవర్గం సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా జీతాల బిల్లుకు సంబంధించి ఒక కోటి 51 లక్షల 34 వేల రూపాయలు నిల్వ చూపించారు. సభ్యులు మంచినీటి సమస్య లేకుండా చూడవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం పది నిమిషాల్లో ముగిసింది.

రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

ఇరిగేషన్ జెఇ ఫణి శంకర్

ప్రజాశక్తి - ఉండి

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని ఇరిగేషన్ జెఇ ఫణి శంకర్ కొబ్బరి చెట్ల లీజుదారులను హెచ్చరించారు. ఈనెల 18వ తేదీన రైతుల సమస్యలు పట్టించుకోరా' అనే శీర్షికన ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఉండి మండలం మహదేవపట్నం గ్రామానికి చెందిన శీలబోయిన తాతయ్య, బొక్కా వెంకటేశ్వరరావు కొబ్బరి చెట్ల లీజుదారులను ఇరిగేషన్ అధికారులు తమ లీజు అగ్రిమెంట్ పత్రాలు చూపించాల్సిందిగా నోటీసులు ఇవ్వడంతో మంగళవారం సాయంత్రం అగ్రిమెంట్ పత్రాలను తీసుకుని ఇరిగేషన్ కార్యాలయానికి వచ్చారు. అగ్రిమెంట్ పత్రాలను పరిశీలించిన అనంతరం ఫణి శంకర్ మాట్లాడుతూ రైతులు తమ పొలాలకు వెళ్లకుండా ఇబ్బందులకు గురి చేస్తూ నూతనంగా నాటిన కొబ్బరి చెట్లను వెంటనే తొలగించాలని, రైతులను ఇబ్బందులకు గురి చేస్తే లీజు అగ్రిమెంటును రద్దు చేస్తామని కొబ్బరి చెట్ల లీజుదారులను ఇరిగేషన్ జెఇ ఫణి శంకర్ హెచ్చరించారు. కొబ్బరి చెట్ల నుంచి తొలగించిన ఆకులను కాలువలో పారేస్తున్నారని తమకు ఫిర్యాదులు కూడా అందాయని, ఇటువంటి ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. రైతులు తమ పొలాలకు వెళ్లి పంటను గట్టుపైకి తీసుకువచ్చేందుకు అడ్డుగా ఉన్న కొబ్బరి చెట్లను సైతం తొలగించే ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు.

రెచ్చిపోతున్న దొంగలు.. బెంబేలెత్తుతున్న ప్రజలు

తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యం

అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ మందపల్లి లక్ష్మణ్

ప్రజాశక్తి - ఉండి

తాళాలు వేసి ఉన్న ఇల్లే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉండి పెద్దపేటలోని ఒక ఇంటి యజమాని తీర్థయాత్రలకు వెళ్లగా ఆదివారం అర్ధరాత్రి ఆ ఇంటిలోకి దొంగలు ప్రవేశించి సుమారు 35 కాసుల బంగారు ఆభరణాలు, 15 కేజీల వెండి, నగదు, కిరాణా దుకాణంలోని సరుకులను సైతం దోచుకుపోయారని ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉండి గోరింతోట సమీపంలోని ఒక ఇంటిలో దొంగలు ప్రవేశించగా చుట్టుపక్కల యువకులు దొంగను పట్టుకుని చితకొట్టి పోలీసులకు అప్పగించారు. ఆ దొంగ ఇటీవల సుమారు 11 దొంగతనాలు చేసినట్లు పోలీసులకు తెలిపాడు. పోలీసులు ఎన్నికల హడావిడిలో ఉండగా దొంగలు తమ పని తాము చేసుకుంటూ ఇళ్లను దోచుకోవడంతో ప్రజలు ఊరెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. సుమారు 23 మంది పోలీసులు ఉండాల్సిన ఉండి పోలీస్ స్టేషన్‌లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఉన్న సిబ్బందితోనే మండలంలోని శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. వేసవికాలం కావడంతో దొంగలు తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటారని, ఎవరైనా ఊరు వెళితే పక్కింటి వారికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఉండి ఎస్ఐ మందపల్లి లక్ష్మణ్ ఉండి మండల ప్రజలకు సూచించారు. ఇంటి యజమానులు ఊరు వెళ్లే సమయంలో ఖరీదైన ఆభరణాలను ఇంటిలో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

సిఐ రజినీ కుమార్

పెనుగొండ: ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీ నాయకులు శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని సిఐ నక్కా రజినీ కుమార్ అన్నారు. మండలంలో సమస్యాత్మకమైన గ్రామం ములపర్రులో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో స్థానిక సచివాలయంలో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉన్నందున వచ్చే నెల నాలుగో తారీఖున ఎన్నికల ఫలితాలు వెలువడనున్నందున ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా కాల్పులు, గ్రామాలలో రోడ్లపై గుంపులు, గుంపులుగా సంచరించడం, హడావుడి చేయటం, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం వంటివి చేయరాదని హెచ్చరించారు. ఫలితాల అనంతరం ఆరో తేదీ వరకు కూడా ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని కోరారు. ఈ కోడ్ అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నేరాలు - ఘోరాలు

ధాన్యం లోడు ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి - పోడూరు

పెనుమంచిలి నుంచి పాలకొల్లు రైస్‌మిల్లుకు ధాన్యం లోడుతో మంగళవారం ఉదయం వెళుతున్న ట్రాక్టర్ గుమ్మలూరు రోడ్డుకు వచ్చేసరికి అదుపు తప్పి పంట కాలువలో బోల్తా కొట్టింది. వర్షం వల్ల రోడ్డు పూర్తిగా పాడై మట్టితో ఉండడంతో జారిపోయి అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. మట్టి తరలింపుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డుపై మట్టి పడడంతో వర్షం వస్తే జిగురుగా మారి జారి పడిపోతున్నారని, ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు, ప్రయాణికులు అధికారులను వేడుకుంటున్నారు.


అభివృద్ధి కాని పారిశ్రామిక వాడ..


అక్రమ లే అవుట్.. కానరాని పరిశ్రమ..

మూతబడిన పలు పరిశ్రమలు..

స్థానికంగా ఉపాధి దొరకక వలసపోతున్న కార్మికులు, విద్యావేత్తలు

పట్టించుకోని ప్రభుత్వాలు

పారిశ్రామిక వాడను అభివృద్ధి చేయాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లుతో పాటు జిల్లాలోని పరిశ్రమలు అంతంత మాత్రమే అభివృద్ధి చెందుతున్నాయి. ఉన్న పరిశ్రమలు మూతపడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. పాలకొల్లులో గతంలో చేనేత, నవ్వారు, షుగర్ ఫ్యాక్టరీ, అగర్బత్తి, కొబ్బరి పరిశ్రమలు ఉండేవి. అయితే ప్రభుత్వాల పారిశ్రామిక నిర్లక్ష్యంతో దాదాపు ఇవన్నీ మూతపడ్డాయి. వీటి స్థానంలో ప్రస్తుతం రొయ్య ప్రాసెస్ యూనిట్ ఒకటే నడుస్తోంది. ప్రభుత్వాలు శ్రామిక శక్తిని పక్కన పెట్టి భారీ పారిశ్రామిక వ్యాపారవేత్తలకు ప్రోత్సాహాలు ఇవ్వడంతో అవే అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో గోదావరి ప్రాంతంలో చదువుకోని వారు గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళుతుండగా, విద్యావేత్తలు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి దూర ప్రాంతాలకు, ఇతర దేశాలకు వలసపోతున్నారు. గత పది సంవత్సరాలుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక శక్తిని, కార్మిక హక్కులను కాలరాయడంతో కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో కార్మికులకు పని గంటలు ఉండేవి. అయితే ఇప్పుడు షాపులు ఎన్ని గంటలైనా తీసుకోవచ్చని నిబంధనలతో కార్మికులను 8 గంటలకు పైగా పనిలో ఉంచి అధిక వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఉదయం 6 గంటలకు షాప్‌లు తీసి అర్ధరాత్రి 12 గంటల వరకు అమ్ముకున్నా పట్టించుకునే అధికారులు లేకపోయారు. దీంతో మహిళా కార్మికులు సైతం తక్కువ వేతనాలతో ఎక్కువ గంటలు పని చేయవలసి వస్తోంది. పాలకొల్లు పట్టణ శివారు చింతపర్రులో పారిశ్రామిక వాడను 45 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. నేటికీ కేవలం కొబ్బరి పీచు పరిశ్రమ మాత్రమే అంతంత మాత్రం నడుస్తోంది. బ్యాంకులు సైతం బడా వ్యాపారులకే రుణాలు అందిస్తున్నాయి. దీంతో చదువుకున్న విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారు. గతంలో పాలకొల్లు రైస్ మిల్ పరిశ్రమకు నిలయంగా ఉండేది. రైస్ మిల్ పరిశ్రమ కూడా నష్టాల ఊబిలో నడుస్తోంది. దీంతో రైస్ మిల్లులను మూసి సినిమా హాలుగానో, కళ్యాణ మండపాలుగానో అభివృద్ధి చేస్తున్నారు. దీంతో కార్మికులు ఉపాధి లేక చాలీచాలని జీతాలతో, ఆకలితో తల్లడిలుతున్నారు.


'ఆక్వా రంగానికి జగన్మోహన్‌రెడ్డి ప్రాధాన్యతనిచ్చారు'

విదేశీ పర్యటనలో స్టేట్ ఫ్రాన్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు వడ్డీ రఘురాం నాయుడు


సమావేశంలో వివరిస్తున్న రఘురాం నాయుడు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆక్వా రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని ఎపి ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ ఆథారిటీ వైస్ ఛైర్మన్, స్టేట్ ఫ్రాన్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు వడ్డీ రఘురాం నాయుడు అన్నారు. ఆక్వా కల్చర్ సాగుకు సంబంధించి కొత్త విధానాలు, నూతన సాంకేతిక పద్ధతులు అవగాహన నిమిత్తం భారతదేశంలోని ఫ్రాన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధుల బృందంతో ఆంధ్రప్రదేశ్ తరపున పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నుంచి ఎపి ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ ఆథారిటీ వైస్ ఛైర్మన్, స్టేట్ ఫ్రాన్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు వడ్డీ రఘురామ్ నాయుడు పాల్గొన్నారు. ఈనెల 18, 19, 20, 21వ తేదీల్లో నాలుగు రోజుల పాటు వియత్నాం, థాయిలాండ్ దేశాలలో ఫ్రాన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులతో కలసి పర్యటించారు. రొయ్య సాగులో ఆయా దేశాలలో అవలంభిస్తున్న సాగు పద్ధతులు, రొయ్య ఎగుమతులలో సాధారణంగా చేసే ఐస్ కిల్లింగ్ ప్రక్రియను అధిగమించి సుమారు 16 గంటల వరకు రొయ్యలు బతికి ఉండే విధంగా చేస్తున్న రొయ్య ఎయిర్ ప్యాకింగ్ ప్రక్రియపై అధ్యయనం చేశారు. అదే విధంగా సముద్ర మధ్య భాగంలోని ఐ ల్యాండ్‌లలో ప్రత్యేకంగా రొయ్య సాగు చేసే విధానాలపై, సాగు విధానంలో నూతనంగా ప్రవేశపెట్టిన సాంకేతిక పరిజ్ఞానం గురించి, రొయ్య దిగుబడి పెంచేందుకు ఆయా దేశాల్లోని బయోటెక్, సిల్వర్ సీ ఆక్వాకల్చర్ కంపెనీల ప్రతినిధులుతో అవగాహనా సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డీ రఘురాం నాయుడు మాట్లాడుతూ వియత్నాం, థాయిలాండ్ దేశాలలో అవలంభిస్తున్న రొయ్య సాగు, అలాగే ఎక్స్‌పోర్ట్స్ నూతన విధానాలను అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా రైతులకు మరింత దిగుబడి పెంచేందుకు అందుబాటులో తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.




ప్రొజెక్టర్ ద్వారా వివరిస్తూ..

ప్రాకృతి ఫిల్లింగ్ స్టేషన్ సేవలు వినియోగించుకోవాలి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ

ప్రజాశక్తి - నరసాపురం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో వాహనాల సంఖ్య పెరిగిందని, వాహనదారుల అభిరుచులకు అనుగుణంగా ప్రాకృతి ఫిల్లింగ్ స్టేషన్ సేవలు అందిస్తుందని భావిస్తున్నామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ అన్నారు. మంగళవారం నరసాపురం రుస్తుంబాద హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్డు కోట్ల రాజా అపార్ట్మెంట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాకృతి ఫిల్లింగ్ స్టేషన్(పెట్రోల్ బంకు)ను ఛైర్‌పర్సన్ వెంకటరమణ ప్రారంభించి మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి సేవలు అందిస్తున్న ఈ పెట్రోల్, డీజిల్ బంకును పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విశాఖపట్టణంకు చెందిన బిపిసిఎల్ రిటైల్స్ టేరిటరి మేనేజర్ దినేష్ గడ్గిల్, రాజమండ్రికి చెందిన బిపిసిఎల్ రిటైల్స్, సేల్స్ సీనియర్ మేనేజర్ పి.మురళీకృష్ణలు ప్రాకృతి ఫిల్లింగ్ స్టేషన్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొద్దిసేపు వాహనదారుల వాహనాలకు పెట్రోలు, డీజిల్ ఫిల్లింగ్ చేసి మాట్లాడారు. ఏ వ్యాపార రంగానికైనా నమ్మకమే పెట్టుబడి అని, అటువంటి నమ్మకాన్ని వాహనదారులకు కలిగిస్తే వ్యాపారాభివృద్ధి జరుగుతుందని అన్నారు. నిర్వాహకులు కోట్ల రాజ, జి.మోహన్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో యర్రా శ్రీను, మేకా సత్యనారాయణ, కోట్ల రామ్ కుమార్, అందే వెంకటకృష్ణ, చాగంటి పార్థసారథి, కూనపరెడ్డి ప్రసాద్, అర్ధాని గౌరి శంకర్, సలాది రామారావు, చినమిల్లి శ్రీనివాస్, పులి భుజంగరావు, నాయుడు విజయ్ ఉన్నారు.


పెట్రోల్ బంక్ ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్ వెంకటరమణ

తాగునీటితో పాటు అన్ని సమస్యలు పరిష్కరిస్తాం

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లాలో తాగునీరు, విద్యుత్తు సరఫరా, జాతీయ ఉపాధి హామీ పనులు ప్రతి ఒక్కరికీ పని కల్పించుటలో పక్కగా అమలు చేస్తున్నామని, కౌంటింగు, లెక్కింపు, తదితర ఏర్పాట్లును వేగవంతం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డికి తెలిపారు. మంగళవారం వెలగపూడి సెక్రటేరియట్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, జాతీయ ఉపాధి హామీ చట్టం పనులు చేపట్టుట, కూలీలకు ఉపాధి కల్పించుట, వేసవిలో విద్యుత్తు సరఫరా, కౌంటింగు ఏర్పాట్లు, లెక్కింపు, తదితర ఏర్పాట్లు, అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వేసవిలో రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ఎటువంటి సమస్యా తలెత్తకుండా చూడాలని, ఏ చిన్న సమస్య వచ్చినా వెనువెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి చెరువులను, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, మంచినీటి చెరువులు, నీటి నిల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అందుకు అనుగుణంగా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనులలో నీటి సంరక్షణ పనులు, మంచినీటి చెరువుల డీసిల్టింగ్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. విద్యుత్తు సమస్యలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి చిన్న సమస్యలు తలెత్తినా వెనువెంటనే పరిష్కారం చూపాలన్నారు. కౌంటింగ్‌ను ప్రశాంతంగా పూర్తి చేయాలన్నారు. బాటిల్స్, టిన్స్ ద్వారా పెట్రోలు అమ్మకాలను నిలుపుదల చేశామని, పక్కగా అమలు చేయాలన్నారు. బాణాసంచా తయారీ, రవాణా, వినియోగంపై రాష్ట్ర వ్యాప్తంగా నిషేధాజ్ఞలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల కౌంటింగు, ప్రకటనలో గెలుపొందిన అభ్యర్థులు వారి మద్దతుగా విజయోత్సవాలు నిర్వహించే క్రమంలో బాణాసంచా కాల్చడం, వాటివల్ల తలెత్తే వివిధ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టంగా నిషేధాజ్ఞలను అమలు చేయాలని జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డ్వామా పీడీ ఎం.ప్రభాకరరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూయస్ అధికారి బివివి.నాగేశ్వరరావు, విద్యుత్ శాఖ ఇఇ ఫీర్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.


వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

కొనసాగిన వేసవి విజ్ఞాన శిబిరం

ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులకు విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మనిషి జీవితంలో అభ్యాసం నిరంతర ప్రక్రియ అని, నిరంతరం పుస్తక పఠనం చేయాలని స్కూల్ టీచర్ సిహెచ్.సతీష్ అన్నారు. తదనంతరం చదవడం మాకిష్టం కార్యక్రమం, క్యారమ్స్, స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్‌లు, పాటలు పాడించడం, దేశభక్తి గేయాలు, కథలు వినిపించడం జరిగింది. ఈ శిక్షణా తరగతులలో స్కూల్ హెచ్ఎం.నాగలక్ష్మి, సుధీర్ మోహన్, సూర్యం బాబు, రాజు, శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు.


ఉత్తమ తృతీయ ప్రదర్శనగా అనూహ్యం ఎంపిక

పాలకొల్లు: పాలకొల్లు నటీ నట సంక్షేమ సమాఖ్య వారు, భీమవరంలో కళారంజని నాటక అకాడమీ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో 'అనూహ్యం' నాటికకు తృతీయ ఉత్తమ ప్రదర్శన అవార్డు లభించింది. ఈ నాటికకు ప్రేక్షకులు నుంచి కూడా విశేష స్పందన లభించింది. పోటీలో ఉత్తమ తృతీయ ప్రదర్శన, ఉత్తమ దర్శకుడిగా కత్తుల రామమోహన్, ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా ఎమ్‌వి రాజర్షి బహుమతులు అందుకున్నారు. ఈ నాటిక రచయిత తాళాబత్తుల వెంకటేశ్వరరావు, నిర్వహణ గుడాల హరిబాబు, మాదిరెడ్డి శ్రీనివాస్, బి.శ్యాంశేఖర్, జ్యోతి రాణి, మాధవిలు నటించారు. ఈ నాటికకు బహుమతులు పొందడంతో పాలకొల్లులోని కళాకారులు, కళాభిమానులు, వివిధ కళా సంస్థల ప్రతినిధులు మేడికొండ శ్రీనివాస్, వంగా నరసింహారావు, మద్దాల వాసు, కెవి.కృష్ణవర్మ, జక్కంపూడి కుమార్, పెనుమాక రామ్ మోహన్, మేడికొండ రామ్ దాస్, అంబటి మురళీ, గంటా ముత్యాలనాయుడు, శివాల రామారావు, చేగొండి సత్యనారాయణ మూర్తి, పుత్సల నాగలింగేశ్వరరావు, నీలంశెట్టి సత్య ప్రసాద్, గంటా ముత్యాలు నాయుడు, గండేటి వెంకటేశ్వరరావు, రావూరి వెంకట అప్పారావు, కొంతేటి శాంతారావు, జాగు సత్యనారాయణ, ఆర్అండ్‌బి మూర్తి నాటిక బృందాన్ని అభినందించారు.


ఉత్తమ నాటికగా ఎంపికైన అనూహ్యం

యర్రంశెట్టివారి పాలెంలో అన్నసమారాధన

నరసాపురం: మండలంలోని యర్రంశెట్టివారి పాలెం పంచాయతీ పీఠాని వారి మెరకలో వేంచేసియున్న జాజులమ్మ అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా మంగళవారం ఉదయం అమ్మవారి ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నసమారాధన కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. నిర్వాహకులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.


విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

రాజీవ్ గాంధీకి ఘన నివాళులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు యడ్ల శివాజీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను, ఐటీ రంగాన్ని దేశంలో ప్రవేశపెట్టిన ప్రధానిగా శివాజీ కొనియాడారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహా వ్యక్తి అని అన్నారు. కాంగ్రెస్ పట్టణ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి, జాతీయ నాయకుల విగ్రహాల వద్ద ఉన్న నిలువెత్తు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సమన్వయకర్త కొలుకులూరి అర్జున్ రావు, బోనం వెంకట్రావు, వర్ధనపు కాసు, కొలిశెట్టి భాను ప్రకాష్, యలమర్తి మోహన్‌రావు, మడకల గోపాలరావు పాల్గొని నివాళులర్పించారు.

ముమ్మరంగా తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల, తాడేపల్లిగూడెం డిఎస్‌పి డిఎస్ఆర్‌విఎస్ఎన్ మూర్తి ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం మిలటరీ కాలనీలో సమస్యాత్మక ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించి, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం పట్టణ సిఐ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణంలో శాంతిభద్రదలకు పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ఈ తనిఖీలు చేస్తూ, అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తాడేపల్లిగూడెంలో ఎవరైనా ఇసి నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం టౌన్ ఎస్ఐలు జెవిఎన్ ప్రసాద్, కె.సుధాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నా బాధ్యత మరింత పెరిగింది

ఎంఎల్ఎ నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గం నుంచి ప్రజలు మూడోసారి ఎంఎల్ఏగా గెలిపించేలా ఉండటం తన అదృష్టమని, ఈసారి తన బాధ్యత మరింత పెరిగిందని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని పట్టణ వార్డులు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులతో పాటు అభిమానులు, ప్రజలు వచ్చి మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఎంఎల్ఎ నిమ్మలను అభినందిస్తూ శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందిస్తున్నారు. మంచి మెజార్టీతో విజయం వరించబోతుందని ధీమాగా చెబుతున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామానాయుడు ప్రతి ఒక్కరినీ పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ తన గెలుపుకు కృషి చేశారంటూ కృతజ్ఞతలు వ్యక్తపరుస్తున్నారు. ఆయన దృష్టికి సమస్యలను తీసుకువస్తుంటే ఆలకించి తీర్చే బాధ్యత నాదంటూ భరోసా ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నా నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేలా అధికారంలోకి రాబోయే టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రజా ప్రభుత్వంలో పని చేస్తానన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో రూపాయి అభివృద్ధి పని జరగకపోగా ఎక్కడ సమస్యలు అక్కడే తిష్ట వేసాయన్నారు. అభివృద్ధి పనులతో పాటు సమస్యలు పరిష్కరించే దిశగా ప్రధాన దృష్టి సారిస్తానని ఎంఎల్ఎ తెలిపారు. పదేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తున్నానని, ఆ నమ్మకంతోనే ప్రజలు తనని మరోసారి ఆశీర్వదించారని, భవిష్యత్తులోనూ ఇదేవిధంగా పనిచేస్తానని ఎంఎల్ఎ తెలిపారు.